ఎట్టకేలకు రహదారికి మోక్షం

విశాలాంధ్ర - పాలకొండ: గత 50 సంవత్సరాలుగా వెలగవాడ నుంచి పిఆర్ రాజుపేట రహదారి గురించి తీవ్ర పోరాటం చేయగా నేటితో ఆ కల నెరవేరిందని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్లకు మోక్షం కల్పించే దిశలో ఈ రోడ్డు 45 లక్షల వ్యయంతో పూర్తి చేయడంతో కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చొరవతో 50 ఏళ్ల కల ఫలించిందన్నారు. అదే విధంగా వెలగవాడ రుద్రిపేట కలిపే రోడ్డులో బహిరంగ మల విసర్జన కోసం ఉపయోగిస్తున్నారని దీనికి గాను చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అదే విధంగా గత సంవత్సరం జలసంరక్షణ కింద పైపులు శిథిలావస్థకు చేరకముందే పనులను త్వరిత గతిన చేపట్టి ఇంటింటికి సురక్షత నీరు అందించే విధంగా కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - సీతంపేట: మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఆటో ప్రమాదాలపై ఆటో డ్రైవర్లకు నివారణ చర్యలపై అవగాహన కల్పించడం జరిగిందని ఎస్సై అమ్మనరావు తెలిపారు. ఆటో డ్రైవ్ చేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిమితికి మించి ప్యాసింజర్స్‌ని ఎక్కించవద్దని, అదేవిధంగా తాగి డ్రైవ్ చేయొద్దని సూచించారు. ఎవరైనా పరిమితికి మించి పాసింజర్స్ ఎక్కించుకున్న , తాగి డ్రైవ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని చట్టపరంగా క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను యూనిట్ ఇన్చార్జి కమిడి భూషణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఎటువంటి రసాయన ఎరువులు పురుగు మందులు లేకుండా పూర్తిస్థాయిలో ప్రకృతి పద్ధతిలో పండించే పంటలను మార్కెటింగ్ చేశారు. ఇందులో వంకాయలు, బెండకాయలు, గోరుచిక్కుడు, దొండకాయలు, చిక్కుడుకాయలు, అరటికాయలు, ఆకుకూరలు, చినుములు, కొర్ర బియ్యము, సామ బియ్యము, ఊద బియ్యము, ఆరికలు బియ్యము, రాగి పిండి, చిరుధాన్యాలతో తయారుచేసిన తినుబండారాలు, జంతికలు, పల్లీల లడ్డు, బిస్కెట్స్, మిక్సర్ అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.గౌరీ, ఐసిఆర్ పీస్, దీప, కత్రక భాస్కరరావు, తాడంగి కామయ్య, ఆరిక సతీష్, చామంతి, దేవిక పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : నేటి అధునాతన బిజీ జీవితంలో ప్రతి ఒక్కరూ వారి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎన్ని కోట్ల డబ్బు ఉన్నా, ఆస్తిపాస్తులు ఉన్నప్పటికీ ఆరోగ్యం లేని వ్యక్తి జీవనం దుర్భరంగా మారుతుందని ప్రముఖ వైద్యులు బందలుప్పి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అభిప్రాయపడ్డారు. సోమవారం పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయగౌడ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై ధ్వజమెత్తిన సభ్యులు

విశాలాంధ్ర - పాచిపెంట: వివిధ సమస్యలపై ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. మండల కేంద్రమైన పాచిపెంట మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశం ఎంపీపీ బి.ప్రమీల అధ్యక్షతన ఎంపీడీవో బీవీజే పాత్ర ఆధ్వర్యంలో జరిగింది. విద్యుత్ మీటర్లు లేకపోవడం వలన తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని పాంచాలి సర్పంచ్ జి.యుగంధర్ అన్నారు. అలాగే క్యారంగి ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ పరిధిలో ఐరన్ విద్యుత్ స్తంభం తుప్పు పట్టి పడిపోవడం వల్ల విద్యుత్ వైర్లు రోడ్డు మీద వేలాడుతున్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ పట్టించుకోవడం లేదని ఆయన ఏఈని నిలదీశారు. అదే విధంగా గురువు నాయుడుపేట ఎంపీటీసీ సభ్యులు కె.రవీంద్ర మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏఈని త్రాగునీటి సమస్యపై నిలదీశారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వేసవి కాలంప్రారంభం కావడం వలన సంబంధిత అధికారులు తాగు నీటి ఎద్దడి లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి కే.తిరుపతిరావు, ఎంపీడీవో బివిజే పాత్రో, తహశీల్దార్ డి.రవి, వైస్ ఎంపీపీ నారాయణమ్మ, కే.రవీంద్ర పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యంపై ఫిర్యాదు

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం రోడ్డు విస్తరణ పనులు, కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు కురుపాం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు వివరించారు. సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ వెంటనే డ్రైన్ పనులు, రోడ్ విస్తరణ పనులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిచేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నుండి అందవరపు వెంకటరమణ, మొనంగి పృథ్విరాజ్, గొల్ల, స్వరాజ్యరావు, జామి ప్రభ, మొనంగి వెంకటరమణ, గోటారి రాజు, రాజబాబు, ఇతర మెయిన్ రోడ్డు వాసులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన ఉండాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: మండలాల్లోని ప్రత్యేక అధికారులకు ఆయా ప్రాంతాల్లో సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఇకపై ప్రతీ శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని, అక్కడ నుంచే వీడియో సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పరిపాలన సౌలభ్యం కొరకు కొన్ని మండలాల్లో ప్రత్యేక అధికారులను మార్పు చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా నియమించబడిన ప్రత్యేకాధికారుల వద్ద ఆయా మండలాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలని, అదేవిధంగా క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇందుకోసం మండల ప్రత్యేక అధికారులు అన్ని శాఖలకు సంబంధించిన మండల సమాచారాన్ని వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా, ఐసీడీఎస్ పీడీలు కె.రామచంద్రరావు, డా. టి.కనక దుర్గ, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, డా. ఎస్.మన్మథరావు, డీఎంహెచ్‌ఓ డా. ఎస్.భాస్కర రావు, ప్రోగ్రాం అధికారులు డా. టి.జగన్మోహనరావు, డా. ఎం.వినోద్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు బి.చంద్రశేఖర్, ఓ.ప్రభాకరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులు స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొర వలస గ్రామంలో గ్రామ సర్పంచ్ రెడ్డి పార్వతి ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక సర్వేపై గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేయడం పెను భారంగా మారుతున్న పరిస్థితులలో తక్కువ పెట్టుబడితో, తక్కువ విస్తీర్ణంలో, ఎక్కువ దిగుబడులు సాధించడం, మార్కెట్ పరిస్థితిని బట్టి పంటలు పండించడం వలన రైతులు ఆర్థిక సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులు ముందుగా విత్తనాలకు ఇండెంట్ పెట్టుకోవాలని, తమకు వున్న మొత్తం పూర్తిస్థాయి విస్తీర్ణంలో అన్ని రకాల విత్తనాలు ఒక ఎకరాకు పది నుంచి పదిహేను కిలోలు తొలకరి వర్షాలకు ముందుగా వేసుకోవడం వల్ల ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు లభించడం వలన రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పి.కుమారి, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, విఏఏ ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లత, జగదీశ్వరి, పార్వతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని మొండెంఖల్లు పంచాయతీ, కొత్తూరు గ్రామంలో సోమవారం స్వార్డ్ సంస్థ ఆధ్వర్యంలో వయోజన విద్యా కేంద్రాలు (నైట్ స్కూల్)ను రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరి ప్రారంభించారు. 18 సంవత్సరాలు వయసు దాటిన మహిళలకు విద్య వల్ల కలుగు ప్రాముఖ్యత, విశిష్టత వివరించారు. 15 గ్రామాలలో గ్రామానికి 30 మంది చొప్పున తరగతులు నిర్వహించడానికి, 30 మందికి చదువు చెప్పడానికి ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని టీచర్‌గా ఎన్నుకొని, ముగ్గురు ప్రాజెక్ట్ ఆఫీసర్‌లను నియమించి, రాత్రి పూట గంటన్నర పాటు చదువు చెప్పే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరికి పలకలు, పుస్తకాలు, బ్లాక్ బోర్డులు రాత్రి స్కూల్‌కి లైట్‌లు కూడా ఇవ్వడం జరుతుందని స్వార్డ్ సంస్థ డైరెక్టర్ బి.దయానంద్ తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన నైట్ స్కూల్ టీచర్స్‌కి సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కే.కొండయ్య, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కద్రక కళావతి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, సుబ్బలక్ష్మి, రంజిత్ కుమార్ నాయకో, లోకనాథం, శ్రీను, మంజువాణి పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: డీఎంహెచ్‌ఓ

విశాలాంధ్ర - బెలగాం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. మెరుగైన ఆరోగ్యానికి సంబం ధించిన స్లోగన్స్ చేస్తూ వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఎన్జీఓ హోంలో సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రారంభంతో ఆశాజనకమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని ఆరోగ్యమే మహాభాగ్యం అని హితవు పలికారు. మాతా, శిశు ఆరోగ్యం పెంపొందించేందుకు కృషి చేయాలనీ, గర్భిణీ, శిశు, బాలింత ఆరోగ్యానికి సంబంధించిన వైద్య సేవలు పక్కాగా అందజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ కెవిఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహ నరావు, డా. ఎం.వినోద్ కుమార్, పిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ విజయ్ మోహన్, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వర రావు, డెమో యోగీశ్వరరెడ్డి, సన్యాసి రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి పౌష్టికాహార పక్షోత్సవాలు

విశాలాంధ్ర - పాచిపెంట: పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం నుండి పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ బి.అనంతలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పౌష్టికారు పక్షి వచ్చే వాళ్ళు ఏప్రిల్ 22 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో జరపనున్నట్లు తెలిపారు. మొదటి 1000 రోజులు (గర్భధారణ మొదలుకొని 2 సంవత్సరాల వయస్సు వరకు) ప్రాముఖ్యత, పోషణ సంరక్షణ, బరువు తక్కువ పిల్లలు గుర్తింపు -సంరక్షణ చర్యలు, అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులు స్వయంగా నమోదు చేసుకొనుటకు అవగాహన తదితరాలు నిర్వహిస్తామన్నారు.

అడవి బిడ్డలకు అండగా కూటమి

ఓట్లు, సీట్లు మాకు ముఖ్యం కాదు
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాలాంధ్ర - అరకులోయ: 'అడవినే నమ్ముకున్న గిరిపుత్రుల గురించి మనసుతో ఆలోచిస్తామని, వారి అభివృద్ధి, అభ్యున్నతి కోసం నిత్యం తపిస్తామని, మాకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని గిరి పుత్రుల సంపూర్ణ అభివృద్ధి, జీవనశైలి పెంపుదల ముఖ్యం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో గిరిజనుల అభివృద్ధికి రూ.92 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే రూ.1005 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కేవలం మాటలు చెప్పి శంకుస్థాపన ఫలకాలు వేసి వెళ్లిపోవడం కాదని, వారం రోజుల్లోనే పనులు మొదలయ్యేలా, సకాలంలో పనులు పూర్తయ్యేలా చూసే బాధ్యతను తీసుకుంటామని పునరుద్ఘాటించారు. "నేను మాటమీద నిలబడే మనిషిని అని, గిరిజనులు అంటే ఓట్లు.. సీట్లు అని ఎప్పుడూ చూడనని, అడవి అంటే నాకు ప్రాణమని, పచ్చని చెట్లను చూస్తే మనసు పులకిస్తుందన్నారు. అడవిని నమ్ముకుని బతికే గిరిబిడ్డల బతుకులను చూస్తే ఆవేదన కలుగుతుందని, 2018 పోరాట యాత్ర సమయంలో అరకులో వారం రోజుల పాటు పర్యటించానని, ఆ సమయంలో అడవి బిడ్డల కోసం ఏదైనా చేయాలని బలంగా సంకల్పించానని అన్నారు. వీరి వెతలు తీర్చేందుకు అధికారం ఉంటే బాగుంటుందని, గిరిపుత్రుల కోసం అధికారం ఇవ్వమని దేవుళ్లను కోరాను అన్నారు. అనుకున్నట్లే ప్రజలు బలమైన నమ్మకంతో 164 సీట్లు కూటమికి కట్టబెట్టి అధికారంలో నిలబెట్టారని, మీరు పెట్టిన ఈ పెద్ద బాధ్యతను అంతే శ్రద్ధతో నిర్వర్తించాలని అనుక్షణం భావిస్తానన్నారు. మూడు నెలల క్రితం ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించినప్పుడు రోడ్ల నిర్మాణం విషయంలో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో వస్తానని మాటిచ్చానని, ఇప్పుడు అదే ప్రణాళికతో రూ. 1000 కోట్లకు పైబడి నిధులు తీసుకువచ్చి డోలీ మోతల రహిత ఏజెన్సీ సాకారానికి మీ ముందుకు వచ్చాను అన్నారు.

నేను ఓట్ల కోసమో.. రాజకీయం చేయడం కోసమో ఇక్కడికి రాలేదని, ఓట్ల కోసం రాజకీయం కోసం అయితే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పేర్లు చెప్పేవాడిని కాదని, పార్టీలు, ప్రభుత్వాలు మారుతూ ఉంటాయన్నారు. పార్టీల మధ్య వైరుధ్య భావాలు ఉండడం సహజం అని, అలా సిద్ధాంత బేధాలు ఉన్నంత మాత్రాన శత్రువులు అయిపోరన్నారు. ప్రజల అభివృద్ధి కోసం కూర్చుని మాట్లాడుకుంటే చాలా పనులు అవుతాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలోని 13,326 పంచాయతీలకు జాతీయ పండుగల నిర్వహణకు సంబంధించిన నిధులను పెంచామన్నారు. అరకు కాఫీ దేశానికి ప్రసిద్ధి అని, ప్రస్తుతం అరకులో కాఫీ తోటలు 2.25 లక్షల ఎకరాల్లో ఉన్నాయని, మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు పెంచేందుకు, ఎత్తయిన ప్రాంతాల్లో ఉద్యానవనాలు పెంచేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి సాయం చేయాలని కలెక్టర్ కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి వెంటనే పనులను చేసేందుకు అనుమతులు ఇచ్చేలా ప్రయత్నిస్తామన్నారు.

గిరిజన విద్యార్థులు ఎందులోనూ తీసిపోరు

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర - అరకులోయ: గిరిజన విద్యార్థులు ఎందులోనూ తీసిపోరని నిరూపిస్తూ 21వేల మంది విద్యార్థులు గత ఐదు నెలలుగా యోగ సాధన చేస్తూ సోమవారం 108 సూర్య నమస్కారాలతో ప్రపంచ రికార్డ్ సాధనకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఐదు మండలాలకు చెందిన సుమారు 21,850 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా అందులో 13,000 పైగా బాలికలు పాల్గొనడం విశేషం అన్నారు. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ గత ఐదు నెలల నుండి వసతి గృహంలోని విద్యార్థులను ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేపి యోగ సాధన చేయించడం ద్వారా విద్యార్థులలో పఠనా శక్తి, ఆలోచన శక్తి, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడిందాన్నారు. ఇందుకు సహకరించిన పతంజలి శ్రీనివాస్, పాఠశాలల పిఇటిలు, ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ అధికారులకు అభినందనలు తెలిపారు. అనంతరం శంఖం పూరించి పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 108 సూర్య నమస్కారలు కార్యక్రమం ప్రారంభించారు. లండన్ ప్రపంచ రికార్డుల యూనియన్ మేనేజర్ చెన్నై నుండి ఈ ప్రపంచ రికార్డ్ గుర్తించడానికి విచ్చేసిన అలిస్ రేనాడ్, ఎమ్మెస్ ఏలిస్ రై నౌడ్ మైదానం మొత్తం కలియ తిరిగి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డా. అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్ బర్దర్, సబ్ కలెక్టర్ సౌర్యామన్ పటేల్, ఎ ఎస్పీ ధీరజ్, ఆర్టీసీ చైర్మన్ దొన్ను దొర, తదితరులు పాల్గొన్నారు.

గూంజు సంస్థ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - చింతపల్లి: నిరుపేదలైన గిరిజనులకు నిత్యవసర సరుకులు బట్టలు పంపిణీ చేయడం అభినందనీయమని తమ్మంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య అన్నారు. ఆ పంచాయతీలోని లక్ష్మీపురం గ్రామంలో గూంజు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెదర కొండబాబు ఆధ్వర్యంలో సుమారు వంద మంది నిరుపేద గిరిజన కుటుంబాలకు సర్పంచ్ లక్ష్మయ్య చేతుల మీదుగా నిత్యవసర సరుకులు, బట్టలు కలిగిన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో గూంజు స్వచ్ఛంద సేవా సంస్థ నిరుపేద గిరిజనులకు అవసరమైన నిత్యవసర సరుకులు, బట్టలు కలిగిన కిట్లు పంపిణీ చేయడంతో పాటు, వారికి కావలసిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుండడం అభినందనీయం అన్నారు. ఈ క్రమంలో 28 రాష్ట్రాలలో విస్తరించి ఉన్న ఈ సంస్థ నిరుపేద గిరిజనులకు ఉపయోగపడే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తుండడం కొనియాడబడిన విషయం అన్నారు. ఈ సందర్భంగా గూంజు ప్రతినిధి కొండబాబు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉండాలి అన్నదే ఈ స్వచ్ఛంద సంస్థ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - సీలేరు: వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జీకేవీధి మండలం దారకొండ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ నాగభూషణం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే వడదెబ్బకు గురికాకుండా ఉండవచ్చునని తెలిపారు. వేసవి కాలం కావడంతో పెరుగుతున్న ఎండ దృష్టిలో ఉంచుకొని తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండ తీవ్రత వలన శరీరంలో డీ హైడ్రేట్ కావడం వలన వడదెబ్బ తగిలి ప్రమాదం లేకపోలేదన్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయట తిరగకపోవడం మంచిదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్ళవలసి వస్తే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ నివారించేందుకు ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం ఉత్తమమని, బయటకు వెళ్ళేటప్పుడు వాటర్ బాటిల్ తప్పనిసరిగా తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. బయటకు వెళ్ళినప్పుడు చల్లటి ప్రదేశాల్లో ఉండటానికి ఎక్కువ ప్రయత్నం చేయాలన్నారు కొబ్బరి నీళ్లు బార్లీ మజ్జిగ ఓ ఆర్ ఎస్ ఎక్కువగా తీసుకోవాలన్నారు. శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉంచడంలో నీటి కంటే మజ్జిగ ఉత్తమమన్నారు. ఎనర్జీ డ్రింక్‌కి బదులు కొబ్బరి బొండం నీళ్లు, మజ్జిగ వంటివి అధికంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

పవన్ పర్యటనతో వారపుసంత వెలవెల

విశాలాంధ్ర - అనంతగిరి: అరకు అందలను తిలకించేందుకు స్థానిక సమస్యలపై అధ్యయనం చేసేందుకు విదేశీ ఇతర ప్రాంతాలకు చెందిన నిపుణులతో పాటు ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, గవర్నర్లు అప్పట్లో మండలంలో పర్యటించి స్థానిక హరితహిల్ రిసార్టులో బసలు వేసిన సందర్భంలు ఎన్నో ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ పర్యటనలో ఈ వింత ఆవరణం ఎదురు కావడంతో స్థానిక ప్రజలు కంగు తిన్నారు. అయితే అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సోమవారం రోడ్డు మార్గన పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో జరుగు వారపు సంత అధికారులు తాత్కాలికంగా రద్దు చేయడంతో పండగ పూట గిరిజన ప్రజలకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి. సోమవారం నుండి మండలంలో మొదలైన ఇట్టుకల పండుగ ప్రారంభం కావడంతో సంత రద్దు కావడంతో పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది.

11న సంత వేలం పాట

విశాలాంధ్ర - అనంతగిరి: స్థానిక సంత వేలం ఆశీలు ముగిసిన నేపథ్యంలో తిరిగి సంత వేలం పాటను ఈనెల 11వ తేదీన డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరుగుతుందని స్థానిక సచివాలయం సెక్రటరీ సిఎస్. దేవ సోమవారం తెలిపారు. స్థానిక సచివాలయ కేంద్రంలో ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక సర్పంచ్ ఎంపీపీ, జెడ్పీటీసీ, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు సమక్షంలో బహిరంగంగా వేలం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

లక్కుళ్లకు సాగు నీటి సదుపాయం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి పంచాయతీ లక్కుళ్ల గ్రామానికి సాగు నీటి సౌకర్యం కలిగిస్తున్నట్లు సర్పంచ్ కె.రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో చెక్‌డామ్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి నిధులతో రూ.19.50 లక్షల వ్యయంతో చెక్ డామ్ ద్వారా సాగునీరు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఐ ఏఈఈ బి.స్వాతి, ఎంపీటీసీ సభ్యుడు జి.అప్పారావు, జి.మాడుగుల 2 ఎంపీటీసీ కె.ఈశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు రమేశ్, భాస్కర్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.కొండలరావు వార్డు మెంబరు కె.రాజారావు, చిన్నబ్బాయి, చంటిబాబు, అంజిబాబు, గిరిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

జంతువులకి అవసరమైన ఉత్పత్తులు తీసుకువచ్చిన అమెజాన్ డాట్ ఇన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఈ జాతీయ పెట్ దినోత్సవం (నేషనల్ పెట్ డే) సందర్భంగా, గొప్ప విలువకు ప్రత్యేకంగా కూర్చిన పెంపుడు జంతువులకు అవసరమైన వస్తువుల కలెక్షన్ ను అందించేలా అమెజాన్ డాట్ ఇన్ ప్రత్యేకమైన స్టోర్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏప్రిల్ 11 నుండి 14 తేదీల మధ్య నడిచే అమెజాన్ డాట్ ఇన్ ఒక ప్రత్యేకమైన స్టోర్ ఫ్రంట్ తో పెంపుడు జంతువులను మరింత ముద్దు చేసేందుకు వీలు కల్పిస్తుందనీ ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఒకటే చోట వివిధ విభాగాలకు చెందిన విస్తృత శ్రేణి ఉత్పత్తులను పొందగలు గుతారన్నారు. తద్వారా శ్రమ లేకుండా, సౌకర్యవంతంగా పెట్ కేర్ చేయగలుగుతారన్నారు. పోషకవంతమైన ట్రీట్స్ మొదలుకుని, వినోదంగా ఉండే బొమ్మలు, అగ్రశ్రేణి గ్రూమింగ్ ఉత్పత్తులు, పెంపుడు జంతువులు ఉండేందుకు ముచ్చటగా ఉండే అవసరమైన ఉత్పత్తుల కోసం స్టోర్ఫ్రంట్, పెడిగ్రీ, డ్రూల్స్, రాయల్ కెనైన్, మూచీ, ఫర్మీనా, హిమాలయా, ఇంకా మరెన్నో అగ్రశ్రేణి ఉత్పత్తులను అందిస్తోందన్నారు.

వారపుసంత వేలంపాట

అనంతగిరి గ్రామపంచాయతీ పరిధిలో గల అనంతగిరి గ్రామంలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతను వేలంపాట నిర్వహించుటకు గాను గౌరవ.డివిజనల్ పంచాయితీ అధికారి పాడేరు వారి ఉత్తర్వులు తేది.03/04/2025 ద్వారా నిర్ణయించిన కనీస ధర రు.10000/- (అక్షరాల పదివేలు రూపాయలకు గాను బహిరంగ వేలం పాట నిర్వహించుటకు గాను తే.11/04/2025దిన అనగా శుక్రవారం ఉదయం 11 గంటలకు అనంతగిరి గ్రామ సచివాలయం ఆవరణలో గౌరవ సర్పంచ్ శ్రీమతి సోమేల రూతు గారి అధ్యక్షతన గౌరవ పంచాయితీ విస్తరణ అధికారి అనంతగిరి మండలం శ్రీ. పి ధర్మారావు గారి సమక్షంలో వేలంపాట నిర్వహించుటకు నిర్ణయించినాము కావున ఆసక్తి కలిగిన ప్రజలు అందరు కూడా సదరు వేలం పాట కార్యక్రమానికి హాజరు కావాలని పత్రిక ముఖంగా కోరుతున్నాము.

ఇట్లు
పంచాయితీ కార్యదర్శి, అనంతగిరి

విశాలాంధ్ర
పేజి: 2
- అల్లూరి సీతారామరాజు
- పార్వతీపురం మన్యం
మంగళవారం 8, ఏప్రిల్ 2025

ఎమ్మెల్సీ గాదెకు సత్కారం

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరుగుతున్న పదవ తరగతి స్పాట్ కేంద్రంలో గల ఉపాధ్యాయులను కలసి కృతజ్ఞతలు తెలియజేయుటకు వెళ్తూ మార్గ మధ్యమంలో గల జిల్లా అధ్యక్షుల వారి పాఠశాలలో కాసేపు ఆగిన సందర్భంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకి సీతానగరం మండలం మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది చిరు సత్కారం చేశారు. తరువాత పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, డివిఎం మున్సిపల్ స్కూల్ స్పాట్ కేంద్రాలలో గల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సెంటర్ ఏర్పాట్లు చక్కగా చేసిన డిఈఓకు అభినందనలు తెలిపారు. అలాగే ఎపిసి కూడా

ఎమ్మెల్సీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వాలేటి తవిటి నాయుడు, ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంకపల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, పరిష్కారంలో అర్జీలు రీఓపెన్ కారాదని కలెక్టర్ అధికారులకు తేల్చిచెప్పారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సుధారాణి భాగస్వామ్యమై అర్జీదారులు నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 110 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యత గల ఎండార్స్ మెంట్ అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా శాఖాధికారులు వారి శాఖలకు సంబంధించిన వినతులను క్షుణంగా పరిశీలించి, తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, జాప్యం చేస్తే సహించబోమని పేర్కొన్నారు. కాగా సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వాటిలో కొన్ని వినతుల వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం ఆగంగూడ గ్రామంలో 56 కుటుంబాలు తాగునీటి కోసం 3 కి.మీ.దూరంలో వేరే ప్రాంతానికి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాయని, వేసవి కారణంగా ఆ బావి నీరు ఇంకి పోవడంతో నీరు లేక చాలా అవస్థలు పడుతున్నామని, కావున తమ గ్రామంలో బోరుబావిని మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు వినతి పత్రాన్ని కలెక్టరుకు అందజేశారు. కొఠియా గ్రామాలైన పలుగుచెన్నూరు, పట్టుచెన్నూరు, కొదమ, గంజాయిభద్ర, గ్రామాల్లోని గిరిజన విద్యార్థులకు తెలుగులో పాఠాలను బోధించడంతో అర్థం కావడం లేదని, కావున జాతాపు భాష తెలిసిన ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు అర్జీని అందించారు.

ఈ కార్యక్రమంలో డ్వామా, ఐసిడిఎస్ పిడిలు కె.రామ చంద్రరావు, డా. టి.కనక దుర్గ, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు కె. రాబర్ట్ పాల్, బి. శ్యామల, డా. ఎస్.మన్మధరావు, డిఎంహెచ్ఓ డా. ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు డా. టి.జగన్మోహ నరావు, డా. ఎం.వినోద్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా పంచా యతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు బి.చంద్రశేఖర్, ఓ.ప్రభాకరరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సిఆర్ఎం శస్త్ర చికిత్స మిషన్ ఏర్పాటు

విశాలాంధ్ర- సీతంపేట: స్థానిక ఏరియా ఆసుపత్రిలో రూ 12.50 లక్షల రూపాయలతో సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఎముకల శస్త్ర చికిత్సలు నిమిత్తం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చొరవతో ఏర్పాటు చేయడం జరిగిందని ఏరియా ఆసుపత్రి సూపరెంటెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డెక్కన్ ఫైన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. శాస్త్ర చికిత్స మిషన్ ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఆర్తోపెడిక్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్పీ

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 9 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ సిఐ అదాం, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల సాధనే లక్ష్యం: ఎమ్మెల్సీ గాదె

విశాలాంధ్ర - బెలగాం: ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీగా ఎన్నుకున్న ఉపాధ్యాయ అధ్యాపకులకు వారికున్న సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా పని చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. 10వ తరగతి మూల్యాంకన పత్రముల స్పాట్ కేంద్రాలను సందర్శించిన సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారిణి రమా జ్యోతి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఎపిసి తేజేశ్వరరావు ఎమ్మెల్సీకు అభినందనలు తెలియజేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి తీరుతామని గాదె అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేయుచున్న పాఠశాల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని దాని కొరకు కృషి చేస్తానని తెలిపారు. పార్వతీపురం పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలకు ప్రాతినిధ్యం చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ గాదె వెంట పార్వతీపురం మన్యం జిల్లా పిఆర్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, మరిచర్ల జగదీశ్వర్‌రావు, గుల్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: మహిళకు గాయాలు

విశాలాంధ్ర - కురుపాం: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం ఉదయం మండల కేంద్రానికి సమీపంలో గల మూలిగూడా జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై పి.నారాయణరావు అందించిన సమాచారం మేరకు కురుపాం మండలం జి.సివడ పంచాయితీ అంటిజోల గ్రామంలో నుంచి ద్విచక్ర వాహనంతో బి.జీవిరావు తన భార్య బి.ప్రియతో కలిసి కురుపాం వస్తుండగా ఎదురుగా జియ్యమ్మ వలస మండలం పిటి మండ గ్రామానికి చెందిన అడ్డాకుల చందు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో గుమ్మలక్ష్మిపురం వెళ్తుండగా ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ప్రియ అనే మహిళకు గాయాలు కావడంతో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రఆస్పత్రికి తరలించారని కేసు నమోదు చేస్తే దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కురుపాం: వీఆర్ఏల సమస్యలపై వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలో గల వీఆర్ఏలు సోమవారం తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి పోరాటంలో భాగంగా ప్లే స్కేల్ పెంచాలని, అటెండర్లు, రాత్రి కాపలా దారులు, వీఆర్వోలుగా అర్హత గలవారికి ప్రమోషన్లు ఇవ్వాలని, నామిని వీఆర్ఏలను వీఆర్ఏలుగా గుర్తించాలని వినతిలో కోరారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు-తల్లి బిడ్డకు ఆరోగ్యం, ఒడిలో

బిడ్డ -బడిలో బిడ్డ పౌష్టికహారం తల్లి బిడ్డకు ఆరోగ్యానికి సోపానం ఏ తల్లి జన్మనిస్తూ మరణించకూడదు ఏ బిడ్డ జన్మిస్తూ మరణించకూడదు వ్యక్తిగత పరిశుభ్రత వెయ్యి రేట్లు మేలు అని నినాదాలు చేశారు. రేఖపల్లి జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయుర్వేదిక్ డాక్టర్ స్వర్ణలత, పిహెచ్ఎన్ భద్రకాళి, హెచ్ఏ పున్నమ్మ, ఏఎన్ఎంలు చంద్రమ్మ, అనూష, బీమామ్మ, హెచ్ఏ శ్రీనివాస్, మంగ, సిహెచ్ఓ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకున్న పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర - కురుపాం: గత వారం రోజులుగా స్థానిక గౌడు వీదిలో నిర్వహిస్తున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి పండుగలో వార్డు మెంబర్ రేణుక, ఎంపీటీసీ సంతోషిల ఆహ్వానం మేరకు సోమవారం మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు ఆమెను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ నిషార్ సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్,

ఎంపీటీసీలు బంగారు నాయుడు, స్వామి, మండల కోఆప్షన్ జీలానీ, నాయకులు శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని డంగభద్ర పంచాయతీ పరిధిలో గల డంగభద్ర వలస గ్రామానికి చెందిన పళ్ళ సీతమ్మ వడదెబ్బ కుమార్గ మధ్యంలో మృతి చెందింది. దంగభద్ర వలస సమీపంలో ఉన్న సీతమ్మ చెరువులో గ్రామానికి చెందిన పళ్ళ సీతమ్మ (62) సోమవారం సాయంత్రం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనికి తిరిగి వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్యలో స్పృహ కోల్పోయి పడిపోయింది. ఈమెకు సపర్యలు చేసి జియ్యమ్మవలస పిహెచ్సికి తరలిస్తామని సిద్ధమవ్వగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమెకు ఒక్కగానొక్క కుమారుడు గౌరు ఉన్నారు. ఈమె మృతితో డంగభద్ర వలస గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.

ఆర్టీసీలో కార్మికుల సస్పెన్షన్ అన్యాయం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ కార్మికుల పట్ల అనుసరిస్తున్న తీరు సరైనది కాదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రశ్నించిన కార్మికులను సస్పెండ్ చేయడం అన్యాయమని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సీతాలక్ష్మి అన్నారు. కండక్టర్ ఏఎస్టి బాబుపై విధించిన అక్రమ సస్పెండును ఎత్తివేయాలని పార్వతీపురం ఎస్.డబ్ల్యు.ఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ డిపో గేటు వద్ద నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా కె.సీతాలక్ష్మి మాట్లాడుతూ డిపో మేనేజర్ కార్మికులను 1/2019 సర్క్యులర్కు విరుద్ధంగా సస్పెండ్, ట్రాన్స్‌ఫర్లు చేస్తున్నారని ఇది చాలా అక్రమమైన చర్యని అన్నారు. ఏఎస్టి బాబు గతం నుండి డిపోలో జరుగుతున్న అనేక అక్రమ పనులకు అడ్డుపడుతూ, ప్రతి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను వ్యతిరేకిస్తుండడంతో ఓడి కండక్టర్ జే.ఎం.రావుతో తప్పుడు కంప్లైంట్ రాయించుకొని దాని ఆధారంగా, ఏ.ఎస్.టి.బాబును సస్పెండ్ చేయడం అన్యాయమని తెలిపారు.

చట్ట వ్యతిరేక విధానాలకు ఎస్.డబ్ల్యూ.ఎఫ్ యూనియన్ వ్యతిరేకమని, కండక్టర్ ఏ.ఎస్.టి.బాబు విధి నిర్వహణలో తప్పుడు కార్యక్రమాలు చేపడితే, దానిపైన విచారణ చేపట్టి, మెమో జారీ చేసి, క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఆ క్రమంలో అతని తీరు మారకుంటే సస్పెండ్ చేయాలే గాని, ఎటువంటి కారణం లేకుండా కార్మికుల మధ్య ఉండే చిన్న పాటి ఘర్షణను, ఆసరాగా తీసుకొని ఇటువంటి విఘాతానికి పాల్పడడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోనల్ అధ్యక్షులు వి.రాములు, విజయనగరం డిపో కార్యదర్శి ఏ.చంద్రయ్య, బి.లక్ష్మి, డి.ఎస్.రావు పార్వతీపురం డిపో అధ్యక్షులు ఎస్.ఎస్.రావు, సిహెచ్.ఎల్.రావు, జి.ఎస్.రావు, టి.వెంకటి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొఠియా గిరిజన గ్రామాల్లో పర్యటిస్తాం.. భద్రత కల్పించండి

ఎస్పీని కోరిన లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి

విశాలాంధ్ర - పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని వివాదాస్పద కొఠియా పరిధిలోని 21 గ్రామాల్లో ఆందోళన చెందుతున్న గిరిజనులకి మద్దతుగా తాము పర్యటించనున్నామని తమకు భద్రత కల్పించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌లను కోరారు. సోమవారం మన్యం జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూభాగంలోని కొఠియా పంచాయతీల 21 గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ రోడ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్మించిన అంగన్వాడీ భవనాలను కూల్చివేసి ఇప్పుడు దిగువ సెంబి వద్ద పవర్ ప్రాజెక్టుని నిర్మిస్తుందని దీనిని అడ్డుకొని గిరిజనులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మౌనంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో జరిగిన పరిణామాలపై లోక్ సత్తా పార్టీ గిరిజనులకు అండగా నిలిచిందని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గోబ్యాక్ ఆంధ్ర పోలీస్ అన్నప్పుడు కూడా లోక్ సత్తా పార్టీ ఆందోళన చేపట్టిందని, ఒడిశా ప్రభుత్వం చేస్తున్న పనులకు అమాయక గిరిజనులు ఆందోళన చెందుతున్నారని, మన రెవెన్యూ అధికారులను, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, ఫారెస్టు అధికారులను 108 వాహనాలను కూడా ఒడిశా అధికారులు, పోలీసులు వివాదాస్పద గ్రామాల్లోకి రానివ్వకపోయినా ప్రభుత్వంలో చలనం లేదని ఆరోపించారు. మన్యం జిల్లా కలెక్టర్, ఎస్పీ వివాదాస్పద గ్రామాల్లో వెంటనే పర్యటించి గిరిజనులకు భరోసా ఇవ్వాలని భీశెట్టి కోరారు,. ఎస్పీ, కలెక్టర్ ని కలిసిన వారిలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, కార్యదర్శి తుమ్మగంటి రాంమోహన్ రావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గొర్లె సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పొందిన నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - చింతపల్లి: వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పట్టా పొందిన నిరుద్యోగ యువతకు నాబార్డ్ ద్వారా రాయితీపై ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వ్యవసాయ క్లినిక్, వర్మీ కంపోస్ట్ తయారీ యూనిట్స్, చేతల గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నిర్మాణానికి సంబంధించి కావలసిన సహాయ సహకారాలు అందించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి శ్రీనివాసరావు అన్నారు అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వ్యవసాయ శాఖ ద్వారా 2025 ఖరీఫ్ సీజన్ కు గాను రైతులకు కావలిసిన పంట రుణాలు పై అవగాహన కల్పిస్తూ పంట రుణాలు నిమిత్తం దరఖాస్తులు స్వీకరించి మండలంలో ఉన్న బ్యాంక్ లకు అందించడం జరుగుతుందన్నారు. రైతులు అందరూ తమ సమీప రైతు సేవ కేంద్రంలో పంట రుణాల కొరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాటికి మొదటి ప్రాధాన్యతను ఇస్తూ పనిచేయాలని కోరారు. అదే క్రమంలో వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పట్టా పొందిన నిరుద్యోగ యువతకు నాబార్డ్ (%చీూదీూ=ఐ%) ఆర్థిక సహకారంతో రాయితీలు ఇచ్చి వ్యవసాయ క్లినిక్ లు , వర్మీ కంపోస్ట్ తయారీ యూనిట్స్ , శీతల గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు కావలిసిన సహాయ, సహకారాలను పొందవచ్చన్నారు. ఆసక్తి ఉండి అర్హత కలిగిన వారు కార్యాలయ పని దినాలలో తనను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మరిన్ని వివరాలకై తనను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 83310 56448. అని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శాటిలైట్ వ్యవస్థ పటిష్టానికి ప్రణాళికలు

విశాలాంధ్ర - బెలగాం : రాష్ట్రలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో సమాచార వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా శాటిలైట్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు విపత్తులు, అగ్నిమాపక శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం మన్యం జిల్లా కేంద్రంలో గల అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పార్వతీపురం అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం రూ.250 కోట్లతో నిధులతో రాష్ట్రంలోని అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణకు త్వరలో శ్రీకారమే కాకుండా టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 17 అగ్నిమాపక కేంద్ర సొంత భవనాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, అందులో పార్వతీపురం, పాలకొండ అగ్నిమాపక కేంద్రాలు పునరుద్ధరణకు సంబంధించి ఒక్కొక్కదానికి రూ.25 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. విపత్కర సమయాల్లో ప్రమాదకర విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.5 కోట్లు విలువ చేసే హజ్మత్ వాహనంతో పాటు అగ్నిప్రమాద సమయాల్లో ప్రజలను రక్షించేందుకు వాడే రూ.3 కోట్లు విలువ చేసే బ్రీతింగ్ ఆపరేటివ్ సిస్టమ్ సిద్ధంగా ఉంచుతుమన్నారు. భవిష్యత్తులో విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి పుషాక్ సెల్యూలర్ వాకీటాకీ స్టేషన్లతో పాటు కంట్రోల్ రూం లను ఏర్పాటు చేయడానికి సర్వం సిద్ధం చేసామన్నారు. అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో ఘటనా స్థలాలకు అత్యంత వేగంగా చేరుకోనేందుకు శాటిలైట్ వ్యవస్థను పటిష్టం చేయడమే కాకుండా రెస్క్యూ టీమ్ ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు మా శాఖ సిద్ధంగా ఉందన్నారు. సిబ్బంది కొరత అయితే ఉంది కానీ, త్వరలో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ రంజన్ రెడ్డి, డిఎఫ్ఓ శ్రీనుబాబు, అగ్నిమాపక అధికారి ప్రభాకరరావు పాల్గొన్నారు.

పీఎం జన్‌మాన్ పథకం గిరిజనులకు వరం

మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ డైరెక్టర్ సమిదాసింగ్

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రధానమంత్రి జన్మన్ పథకం ఆదివాసి గిరిజనులకు వరమని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ డైరెక్టర్ సమిదా సింగ్ అన్నారు. మండలంలోని తాజంగి, లంబసింగి, పెద బరడ పంచాయతీలలో సోమవారం ఆకస్మికంగా పర్యటించిన సింగ్ ముందుగా తాజంగి లో గిరిజన స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం లంబసింగి పంచాయతీ జల్లూరు మెట్ట, రాజు బంద గ్రామాలలో ప్రధానమంత్రి జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహాల నిర్మాణ పనులను పరిశీలించారు. పెదబరడ పంచాయతీలో కాఫీ ప్లాంటేషన్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ డి ఈ రఘు, ఏఈ యాద కిషోర్, గృహ నిర్మాణ శాఖ ఇన్చార్జ్ డి ఈ రమణ, పంచాయతీ కార్యదర్శి, ఐటీడీఏ ఏపీ ఓ లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

షిరిడి సాయి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని ధర్మలక్ష్మీపురంలో గత మూడు రోజులుగా జరుగుతున్న షిర్డీసాయి విగ్రహ ప్రతిష్టలో సోమవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే జగదీశ్వరి పాల్గొన్నారు. సాయినాధుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో పెద్ద బాబా విగ్రహం ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని, విగ్రహాన్ని చూస్తుంటే నేరుగా సాయినాథుని చూసిన అనుభూతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, ఏఎంసీ చైర్మన్ కద్రక కళావతి, నాయకులు కోలా రంజిత్ కుమార్, శ్రీను, రంజిత్ కుమార్ నాయకో, ప్రతాప్, శంకర్, తిరుపతి, స్థానిక సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, సాయి సేవకులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే వాహన రుణాలు

బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అరుణ్ కుమార్

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: జడ్డంగి బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పరిధిలో అతి తక్కువ వడ్డీకే వాహన రుణాలు అందిస్తున్నట్లు మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు. వాహన రుణం కావాలిసిన వారు ఫారం 16తో పాటు ఆరు నెలలు జీతం పొందినట్లుగా పే స్లిప్పులు తీసుకురావాలని తెలిపారు. ప్రస్తుతం వాహన ఋణం నూటికి 75 పైసలు వడ్డీ ఉంటుందన్నారు. అలాగే బంగారంపై 75 పైసల వడ్డీతో లోన్లు ఇస్తున్నామని, గ్రాముకి 5700 రూపాయలు ఇస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ఖాతాను తెరవాలంటే ఆధార్ కార్డు, పాన్ కార్డును తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అరుణ్ కుమార్, క్యాషియర్ అప్పన్నబాబు, ఆఫీసర్ చక్రధరరావు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్‌కు నోచుకోని గిరిజన పిల్లలు

విశాలాంధ్ర - మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఎంసీడీ క్యాంప్ గ్రామంలో ఉన్న స్కూలు పిల్లలకు మిడ్డే మీల్స్‌కు గాను ప్రభుత్వం తరవున నెలకు 40 కేజీల బియ్యం అందటం లేదు. ఇప్పటి వరకు 80 కేజీల వరకు వరకు ఇవ్వవలసిన మోతుగూడెం రేషన్ డీలర్ ఇవ్వకపోటం వలన మధ్యాహ్న భోజనం పెట్టలేమని నిర్వాహకురాలు తెలిపింది. రెండు నెలలుగా తన ఇంట్లో ఉన్న బియ్యంతో 22 మంది విద్యార్థులకు వండి పెట్టానని ఇక తను పెట్టలేనని వాపోయింది. బియ్యం ఇస్తానని చెప్పి వేలుముద్ర వేయించుకున్నారు కాని ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యువతి అదృశ్యం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండల కేంద్రమైన జియ్యమ్మ వలస గ్రామానికి చెందిన బొమ్మల శిరీష (17) ఈ నెల 4వ తేదీ నుండి కనిపించడం లేదని తల్లి అనసూయ మండల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టరు ఎన్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఎవరికైనా ఆచూకి తెలిసిన యెడల 9121109479 నెంబర్‌కి సమాచారం తెలియజేయాలని ఆయన కోరారు.

10న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీఓ

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: యువతీ యువకులకు ఉపాధి కల్పన (స్కిల్ డెవలప్మెంట్) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10న కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగబోవు జాబ్ మేళాకు అర్హత ఉండి ఆసక్తి కలిగిన మండలంలోని యువతీ యువకులు తమ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కాగలరని ఎంపీడీఓ శంబంగి రమేష్ తెలిపారు. కాగా ఈ ఉద్యోగాల కోసం జాబ్ డీలర్స్ కంపెనీ విశాఖపట్నం వారు 90 ఉద్యోగాల కోసం యువతీ యువకులను, హీరో మోటో కార్పొరేషన్ వారు 80 ఉద్యోగాలకు గాను యువతీ యువకు లను, అపోలో ఫార్మసీలో 40 ఉద్యోగాలకు విజయనగరం, విశాఖపట్నంలో పనిచేయుటకు యువతీ యువకులు వాల్టాన్ కంపెనీలో 80 ఉద్యోగాలకు స్క్రీటీలోను పేటీఎం విజయ నగరం, విశాఖపట్నంలో పనిచేయుటకు యువకులు ఎస్బిఐ కార్డ్స్ కంపెనీలో పనిచేయుటకు 50 ఉద్యోగాలకు గాను విశాఖపట్నంలో పనిచేయుటకు యువతీ యువకులు మెడ్ ప్లస్ లో విశాఖపట్నంలో పని చేయుటకు, 50 ఉద్యోగాల గాను ట్రై చెయ్ కాస్ట్ టెక్ యువతీ యువకులు, సాక్స్ కాన్ కంపెనీలో 20 ఉద్యోగాల గాను హైదరాబాదులో పనిచేయుటకు యువతీ యువకులు అలాగే జాబ్ డీలర్స్ కంపెనీ 60 ఉద్యోగాలకు హైదరాబాదులో పనిచేయుటకు ఇంటర్వ్యూలు జరుగుతా యన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అన్నారు.

బెల్లం ఊటలను ధ్వంసం చేసిన ఎక్సైజ్

విశాలాంధ్ర - కురుపాం: ముందస్తు సమాచారం మేరకు సారా తయారీ కేంద్రాలపై సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల ఎక్సైజ్ కార్యాలయంలో పత్రిక విలేకరులతో ఆయను మాట్లాడుతూ గుమ్మలక్ష్మిపురం మండలంలో గల ఇరిడి గ్రామనికి చెందిన బిడ్డిక గుండు అనే వ్యక్తి నుండి 20 లీటర్ల నాటు సారా స్వాధీన పరుచుకొని తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ను ధ్వంసం చేశామని , సారా తయారీకి అవసరమైన ముడి సరుకులు అందజేస్తున్నటువంటి అదే గ్రామానికి చెందిన సుబుద్ధి మణికంఠ అనే వ్యక్తి నుండి 15 కేజీల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు పై కేసు నమోదు చేసే రిమండ్‌కి తరలించామని తెలిపారు.